క్లుప్తంగా

గ్యారంటీల వల్లే అధికారం



అమృతప్ప

యాలాల: రాష్ట్రంలో కాంగ్రెస్ గాలి వీస్తుండటంతో పాటు ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలు నమ్మారు కాబట్టే.. పార్టీ అధికారంలోకి వచ్చిందని ఆ పార్టీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు అమృతప్ప తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థి మనోహర్‌రెడ్డి గెలుపునకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణలో పార్టీ అధికారంలోకి రావడం సంతోషంగా ఉందన్నారు. మనోహర్‌రెడ్డి సహకారంతో మండల అభివృద్ధికి పాటుపడతామన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు



ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న మహిళలు

కొడంగల్ రూరల్: పట్టణంలోని వడ్డరగల్లీలో వెలసిన భూలక్ష్మి అమ్మవారికి శుక్రవారం రైతులు, మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాన్ని రంగులతో మామిడి తోరణాలతో అలంకరించారు. మహిళలు ఊరేగింపుగా బోనాలతో వచ్చారు. ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అంతకుముందు కాలనీవాసులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమను చల్లంగ చూడాలని వేడుకున్నారు.

పరిశుభ్రత అందరి బాధ్యత



దౌల్తాబాద్‌లో అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

దౌల్తాబాద్: గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పీహెచ్‌సీ సూపర్‌వైజర్ రఫీ సూచించారు. శుక్రవారం బిచ్చాల, గుముడాల, దౌల్తాబాద్ గ్రామాల్లో వైద్యసిబ్బంది డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఇంటి ముందర నీటిని ఎక్కువ రోజులు నిల్వ ఉంచుకోరాదని సూచించారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు.

ప్రసాద్‌కుమార్‌ను కలిసిన హన్మంత్‌రెడ్డి



ప్రసాద్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న హన్మంత్‌రెడ్డి

ధారూరు: తెలంగాణ అసెంబ్లీ స్పీకర్‌గా ఎన్నికైన గడ్డం ప్రసాద్‌కుమార్‌ను శుక్రవారం జిల్లా వాలీబాల్ అసోషియేషన్ అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి కలిశారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

వన భోజనాలు



వనభోజనాలు చేస్తున్న విద్యార్థినులు

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని సంఘం లక్ష్మీబాయి బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో శుక్రవారం వనభోజనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఉన్న చెట్ల కిందనే విద్యార్థులు సామూహిక భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమణమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కరుణించు భవానీ మాత



ప్రత్యేక అలంకరణలో భవానీమాత

బషీరాబాద్: మండలంలోని దామర్‌చెడ్ భవానీనగర్‌లో వెలసిన అంబాభవానీ మాత శుక్రవారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. తెలంగాణ సాదు పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు శంకర్ స్వామి భక్తులకు ప్రవచనాలు చెప్పారు. అనంతరం అన్నదానం చేశారు.

ఏం కొనాలి.. ఏం తినాలి!

ఆకాశన్నంటిన ధరలు
- రూ.180కి చేరిన కిలో కందిపప్పు
- పెరిగిన ఇతర పప్పుదినుసుల ధరలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



పప్పుదినుసులు

దౌల్తాబాద్: నిత్యావసరాల్లో ప్రధానమైనవి పప్పుదినుసులు. కొంతమందికి ప్రతి రోజు పప్పుకూర లేనిదే నోట్లో ముద్ద దిగదు. అలాంటిది ప్రస్తుతం పప్పుల ధరలు భారీగా పెరగడంతో.. పప్పన్నం తినాలంటే ప్రజలు హడలిపోతున్నారు. పప్పుదినుసుల ధరలు చుక్కలంటుతున్నాయి. కూరగాయల ధరలు కొండెక్కడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అమాంతంగా నిత్యావసరాల ధరలు పెరగడంతో సామాన్యులు విలవిలలాడుతున్నారు.

పెరిగిన ధరలు

పప్పు దినుసుల ధరలు పెరగడంతో కొనుగోలు చేయాలంటేనే ప్రజలు వణికిపోతున్నారు.పెరిగిన ధరలతో అన్ని వర్గాలు తలకిందులవుతున్నాయి. నెలవారి బడ్జెట్‌లో సగభాగం నిత్యావరసరాలకే సరిపోవడంలేదని వాపోతున్నారు. రోజంతా కూలీ చేసినా.. కిలో పప్పు కొనలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా ఈ సీజన్‌లో కూరగాయాల ధరలు తక్కువగా ఉండాలి. కానీ ప్రస్తుతం ధరలు మండిపోతున్నాయి. ఉల్లిగడ్డ ధరలు పెరగడంతో పాటు ఇతర కూరగాయాల ధరలు ఆకాశానంటుతున్నాయి.

ధరల నియంత్రణేది?

పప్పు దినుసుల ధరలు పెరగడంతో వినియోగదారులు కొనడానికి ఇబ్బంది పడుతున్నారని వ్యాపారులు చెబుతున్నారు. ధరల పెరుగుదలతో మార్కెట్‌లో విక్రయాలు మందకొండిగా సాగుతున్నాయి. అయితే ధరలను నియంత్రించడంలో అధికారులు విఫలమయ్యారనే విమర్శలు గుప్పుమంటున్నాయి. పర్యవేక్షించాల్సిన అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు.

పప్పుల ధరలు.. కిలోల్లో

కంది	రూ.180
పెసర	రూ.120
శనగ	రూ.90
మినపప్పు	రూ.140
బెబ్బెరపప్పు	రూ.80

సంపాదనంతా పప్పు, ఉప్పులకే

ప్రతి ఏడాది పప్పుల ధరలు పెరుగుతున్నాయి. దీంతో సంపాదనంతా పప్పు, ఉప్పులకే సరిపోతోంది. ధరలు అమాంతంగా పెరగడంతో ఇబ్బంది పడుతున్నాం. కొత్త ప్రభుత్వం రేషన్‌షాపుల్లో పప్పు దినుసులు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి.

– నర్సింగమ్మ, దౌల్తాబాద్

పేదల సంక్షేమమే రేవంత్ లక్ష్యం

పీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డి

ధారూరు: అడ్డదారిలో గెలువాలనుకున్నా బీఆర్‌ఎస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పారని పీసీసీ ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల రఘువీరారెడ్డి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని శుభం ఫంక్షన్‌హాల్‌లో పార్టీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి పేదల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తారని తెలిపారు. కాబోయే స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఈ ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తారని పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తలు, నాయకులకు న్యాయం చేస్తారని భరోసా ఇచ్చారు. పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలు ప్రతి ఒక్కరికీ చేరేలా కార్యకర్తలు పని చేయాలని పిలుపునిచ్చారు. దళిత, బీసీబంధు లబ్ధిదారుల నుంచి బీఆర్‌ఎస్ నాయకులు రూ.లక్షల్లో దండుకున్నారని ఆరోపించారు. సమావేశంలో ధారూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, రాంపూర్ తండా సర్పంచ్ పాండునాయక్, కాంగ్రెస్ నాయకులు మహ్మద్ బాబాఖాన్, వాణిశ్రీ, యాదమ్మ, మాన్‌సింగ్, రమేశ్‌కృష్ణ, బుజ్జయ్యగౌడ్, రాఘవేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రఘువీరారెడ్డి

ప్రజా తీర్పును గౌరవిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న మహేశ్‌రెడ్డి

ప్రజా సేవ చేస్తాం
- మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

పరిగి: ప్రజా తీర్పును గౌరవిస్తామని, నిత్యం ప్రజల మధ్యే ఉండి ప్రజా సేవ చేస్తానని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి ప్రకటించారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని తన నివాసంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2018లో ప్రజలు తనను గౌరవించి ఎమ్మెల్యేగా ఎన్నుకున్నారని, ఐదేళ్లు ప్రజా సేవ చేశానని గుర్తుచేశారు. ఓడిపోయినా అందరికీ అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. మాజీ సీఎం కేసీఆర్ సారథ్యంలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను అర్హులైన వారికి అందేల కృషి చేశానని గుర్తుచేశారు. ప్రతిపక్షంలో ఉండి ప్రజా సమస్యలపై పోరాటం చేస్తామన్నారు. నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చి సుపరిపాలను ప్రజలకు అందించాలని ఆకాంక్షించారు. నియోజకవర్గ అభివృద్ధిలో తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్, ఎంపీపీ అరవింద్‌రావు, మండల పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్, సీనియర్ నాయకుడు ప్రవీణ్‌రెడ్డి, రవికుమార్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై పోరాడుదాం

కుల్కచర్ల: ప్రతిపక్షంలో ఉన్నా.. ప్రజా సమస్యలపై పోరాడుతామని మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి ప్రకటించారు. శుక్రవారం కుల్కచర్ల మండలం పుట్టపహడ్ గ్రామంలో కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఓటమితో అధైర్యపడకూడదని, ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. పార్టీకి మంచిరోజులు వస్తాయని జోస్యం చెప్పారు. భవిష్యత్‌లో జరగనున్న ఎన్నికలపై అందరూ దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ రాందాస్‌నాయక్, చౌడాపూర్ మండల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, రైతుబంధు మండల కమిటీ అధ్యక్షుడు రాజు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు, చౌడాపూర్ మండల బీఆర్‌ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు మేగ్యానాయక్, నాయకులు రాజప్ప, హరికృష్ణ, పులిరాములు పాల్గొన్నారు.

వన్నె తగ్గిన తెల్ల బంగారం

పత్తి రైతు దిగాలు
- గిట్టుబాటు కాని మద్దతు ధర
- కూలీలు దొరక్క తిప్పలు
- వాతావరణం అనుకూలించక తగ్గిన దిగుబడి
- అప్పుల పాలవుతున్న అన్నదాత



ఎన్కేపల్లిలో పొలంలోనే ఉన్న పత్తి పంట

మోమిన్‌పేట: పత్తికి ధర లేక రైతన్న ఆందోళన చెందుతున్నాడు. మద్దతు ధర లేక నష్టపోతున్న అన్నదాత.. ఈ ఏడాది కూడా అదే పరిస్థితిని ఎదుర్కొంటున్నాడు. దీనికితోడు వాతావరణం అనుకూలించక పత్తి దిగుబడి గణనీయంగా తగ్గింది. ఎకరాకు 10 క్వింటాళ్ల నుంచి 12 క్వింటాళ్లు రావాల్సి ఉండగా 6 నుంచి 8 క్వింటాళ్లే వస్తుందని కర్షకులు వాపోతున్నారు. దిగుబడులు తగ్గడంతో పెట్టుబడి వ్యయం పెరిగిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర దక్కకపోవడంతో దళారులను ఆశ్రయించాల్సి వస్తోందని చెబుతున్నారు.

పత్తితీతకు కష్టాలు

కూలీల సమస్య కూడా పత్తి రైతును వెంటాడుతోంది. పంటను చేన్లలో నుంచి తీసేందుకు గ్రామాల్లో కూలీలు దొరకడం లేదు. కూలీల కొరతతో పత్తి ఎలా ఏరాలో తెలియక ఇబ్బంది పడుతున్నారు. మండల వ్యాప్తంగా ఈ సమస్య కర్షకులను వెంటాడుతోంది. ముంచుకోస్తున్న తుఫాన్ ప్రభావం వల్ల వర్షాలు కురిస్తే పంట నాణ్యత దెబ్బతింటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. నిన్న మొన్నటి వరకు ఎన్నికల కోలాహలంలో ఉన్న కూలీలు.. పత్తిని తీసేందుకు ఎక్కువ కూలీ అడుగుతున్నారని రైతులు వాపోతున్నారు.

పెరిగిన పెట్టుబడి వ్యయం

వాతావరణం అనుకూలించక పంట ఎదుగుదలలో తీవ్ర ప్రభావం చూపించింది. ఒక నెల ఎండలు మరొక ఒక నెలలో వర్షాలు కురవడంతో దిగుబడి గణనీయంగా తగ్గింది. పంట పెట్టుబడి పెరిగిందని.. కానీ దిగుబడి తగ్గుతోందని రైతులు పేర్కొన్నారు. ఎకారకు రూ.30వేలకు పైగానే పెట్టుబడి వ్యయం వచ్చిందని అంటున్నారు. పత్తి తీత కూలీల ఖర్చులు అదనంగా పెట్టాల్సి వస్తోందని వాపోతున్నారు.

గిట్టుబాటు గాని మద్దతు

ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర గిట్టుబాటు కావడం లేదని రైతన్న ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గరిష్టంగా క్వింటాకు రూ.7,020 వేలు ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించింది. ఇది గిట్టుబాటు కాదని, రూ.10వేలు ప్రకటించాలని రైతులు కోరుతున్నారు. మొత్తానికి గోరు చుట్టు మీద రోకలి పోటు అన్న చందంగా పత్తి రైతు పరిస్థితి మారింది.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఖాళీ

తాండూరు: తాండూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి శుక్రవారం ఖాళీ చేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రోహిత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చేతిలో ఓటమిపాలయ్యారు. దీంతో ఆర్‌అండ్‌బీ శాఖ ఆధీనంలో ఉన్న క్యాంపు కార్యాలయాన్ని ఖాళీ చేశారు. అందులో భాగంగా రోహిత్‌రెడ్డి కుటుంబ సభ్యులు కార్యాలయంలోని సామగ్రిని తీసుకెళ్లారు. అయితే ప్రభుత్వ నిధులతో చేయించిన ఫర్నిచర్, ఇతర వస్తువులను రోహిత్‌రెడ్డి కుటుంబ సభ్యులు తీసుకెళ్తున్నారంటూ ప్రచారం జరిగింది. దీంతో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు హబీబ్‌తో పాటు పలువురు నాయకులు కార్యాలయానికి చేరుకొని.. ఆర్‌అండ్‌బీ శాఖకు చెందిన ఉద్యోగి లాలప్పతో మాట్లాడారు. ప్రభుత్వ నిధులతో చేయించిన వస్తువులను తీసుకెళుతున్నారా అని ప్రశ్నించారు. దీంతో లాలప్ప స్పందిస్తూ ఏసీలు, ఫర్నిచర్ అన్నీ ఉన్నాయని తెలిపారు. సీసీ కెమెరాలు, ఫ్యాన్‌లు, టెబుల్‌లను రోహిత్‌రెడ్డి సొంత ఖర్చులతో చేయించుకున్నారని.. అయినా వాటిని కార్యాలయంలో వదిలి వెళుతున్నామని పైలెట్ కుటుంబ సభ్యులు తెలిపారు. రోహిత్‌రెడ్డి నుంచి భవనాన్ని స్వాధీనం చేసుకున్న అధికారులు.. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి అప్పగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.



ఆర్‌అండ్‌బీ వర్క్ ఇన్స్‌పెక్టర్‌తో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

రేపటితో ముగియనున్న రుద్రాభిషేకం

అనంతగిరి: నెల రోజులుగా జరుగుతున్న రుద్రాభిషేక మహోత్సవం ఆదివారంతో ముగుస్తుందని నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా రామ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 5.30 గంటలకు ఓంకారము, సుప్రభాతం, నగర సంకీర్తన, 6.30 గంటలకు గోపూజ, 8 గంటలకు మహా గణపతి పూజ, రుద్రాభిషేకం ఉంటుందని తెలిపారు. మధ్యాహ్నం 12.15గంటలకు పార్వతీపరమేశ్వరుల శాంతి కల్యాణం, ఒంటి గంటకు ప్రముఖ వ్యాఖ్యాత భాస్కరయోగి ఆధ్యాత్మిక ప్రవచనం ఉంటుందన్నారు. అనంతరం మహా మంగళహారతి, అనంతరం అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. సాయంత్రం 5.30 గంటలకు దివ్య రథోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని పేర్కొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

బషీరాబాద్: వరి కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని నావంద్గీ పీఏసీఎస్ చైర్మన్ వెంకట రామ్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని మైల్వార్, నావంద్గీ (బషీరాబాద్), దామర్‌చెడ్ గ్రామాల్లో సొసైటీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు బయట మార్కెట్‌లో తక్కువ ధరకు విక్రయించొద్దని, ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకే అమ్ముకోవాలని సూచించారు. తూకాల్లో తేడాలుంటే తమకు ఫిర్యాదు చేయాలన్నారు. అక్రమాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్, డైరెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, అశోక్ గౌతం, నాయకులు శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజా ప్రభుత్వం మొదలైంది

కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాణయ్య

మొయినాబాద్: తెలంగాణ ప్రజలు కలలు గన్న ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ ఆధ్వర్యంలో మొదలైందని మండల అధ్యక్షుడు మాణయ్య అన్నారు. మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజా సమస్యలు తెలుసుకోవడానికి ఏర్పాటు చేసిన ప్రజాదర్బార్‌కు విశేష స్పందన లభించిందన్నారు. ఇంత కాలం ప్రజలు తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో అర్థంకాక మదనపడ్డారన్నారు. తెలంగాణ ప్రజలకు ఇప్పుడు స్వేచ్ఛగా తమ సమ్యలు చెప్పుకునే అవకాశం వచ్చిందన్నారు. శుక్రవారం ప్రజా భవన్‌లో నిర్వహించిన ప్రజాదర్బార్‌కు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి వేల మంది వచ్చి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తమ సమస్యలు తెలియజేశారన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ఏఎస్‌ఐ సత్యనారాయణచారి

దోమ: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఏఎస్‌ఐ సత్యనారాయణ సూచించారు. శుక్రవారం దోమ మండల పరిధిలోని బొంపల్లిలో ఎస్‌ఐ రవిగౌడ్ ఆదేశాల మేరకు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టూ విల్లర్ వాహనదారులు హెల్మెట్, ఫోర్ విల్లర్ వాహనదారులు సీటు బెల్ట్ తప్పనిసరిగా ఉపయోగించుకోవాలన్నారు. అతివేగం ఎంతో ప్రమాదకరమని, నిర్ణీత వేగంతో వాహనాలను నడపాలని సూచించారు. చిన్నారులకు వాహనాలను ఇవ్వకూడదని తెలిపారు. నంబర్ ప్లేట్స్ లేని వాహనాలను రోడ్లపై తిప్పితే సీజ్ చేస్తామని, మద్యం తాగి వాహనాలను నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్స్ రాజు తదితరులు పాల్గొన్నారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న సత్యనారాయణ

ప్రసాద్‌కుమార్‌ను కలిసిన కాంగ్రెస్ నేతలు

కుల్కచర్ల: శాసనసభ స్పీకర్‌గా ఎంపికైన ప్రసాద్‌కుమార్‌ను కుల్కచర్ల మండల యువజన కాంగ్రెస్ నాయకులు కుమ్మరి స్వామి, వినోద్ శుక్రవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం వారు మాట్లాడుతూ వికారాబాద్ జిల్లా పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లోని గ్రామీణ ప్రాంతల అభ్యున్నతికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరామని తెలిపారు. జిల్లా అభివృద్ధికి పాటు పడాలని కోరారు.



ప్రసాద్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాంగ్రెస్ నేతలు

ప్రజాదర్బార్‌కు చేవెళ్ల నుంచి ఫిర్యాదు

చేవెళ్ల: తెలంగాణ రాష్ట్ర నూతన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జ్యోతిరావుపూలే ప్రజాభవన్‌లో ఏర్పాటు చేసిన ప్రజాదర్బార్‌కు చేవెళ్ల మండలం నుంచి ఓ దివ్యాంగుడు ఫిర్యాదు చేసుకున్నాడు. శుక్రవారం ఉదయం ప్రారంభించిన ప్రజాదర్బార్‌కు చేవెళ్ల మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన గండు రవీందర్ తనకు ఆసరా పెన్షన్ రావడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ ప్రజాదర్బార్‌లో తన సమస్యను మంత్రి సీతక్కకు నేరుగా చెప్పుకొని వినతి పత్రం అందించినట్లు ఆయన పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన మొదట్లో తనకు వచ్చే ఆసరా పెన్షన్ ను తొలగించారని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విషయంపై అప్పటి నుంచి నేటి వరకూ ఫిర్యాదు చేసిన తనకు పెన్షన్ మంజూరు కాలేదని వాపోడాడు.

స్వపరిపాలన దినోత్సవం

చేవెళ్ల: చేవెళ్ల మండలకేంద్రంలోని ప్రభుత్వ బాలికల ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఘనంగా స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఎప్పుడూ పాఠశాలకు తోటి విద్యార్థులతో కలిసి వచ్చే స్నేహితులు ఉపాధ్యాయులుగా పాఠం చెప్పడంతో తోటి విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు.

చాతుర్మాస ముగింపు వేడుకలు

కొడంగల్ రూరల్: పట్టణంలోని సన్‌సిటీ కాలనీలో మంచాల పాండురంగయ్య నివాసంలో గురువారం రాత్రి అత్యంత భక్తిశ్రద్ధలతో చాతుర్మాస ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆధ్యాత్మిక ధార్మిక సేవా సమితి ఆధ్వర్యంలో ఆషాడ శుద్ధ ఏకాదశి మొదలు కార్తీక శుద్ధ ఏకాదశి వరకు నాలుగు నెలల పాటు ప్రతీ గురువారం రాత్రి 9 గంటల నుంచి 11–30 గంటల వరకు భజన కార్యక్రమాలు నిర్వహించారు. ముగింపు వేడుకల్లో భాగంగా మంచాల పాండురంగయ్య నివాసంలో గురువారం రాత్రి శ్రీకృష్ణ విశ్వరూపం చిత్రపటానికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆధ్యాత్మిక ధార్మిక సేవా సమితి ఆధ్వర్యంలో భజన కార్యక్రమాలు నిర్వహించారు.



భజన చేస్తున్న ఆధ్యాత్మిక ధార్మిక సేవా సమితి సభ్యులు

గురువుల పాత్ర వెలకట్టలేనిది

కుల్కచర్ల: విద్యార్థుల్లో క్రమశిక్షణ, జ్ఞానం పెంపొందించడంలో గురువుల బాధ్యత వెలకట్టలేనిదని చాకల్‌పల్లి సర్పంచ్ రాములమ్మ ప్రశంసించారు. చౌడాపూర్ మండలం చాకల్‌పల్లి జెడ్పీ పాఠశాలలో బదిలీపై వెళ్లిన ప్రధానోపాధ్యాయులు శంకర్‌కు శుక్రవారం పాఠశాలలో వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులను ఉన్నత స్థితికి తీసుకెళ్లేందుకు ఉపాధ్యాయులు చేసే కృషి గొప్పదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాంచందర్, రాజు, నాయకులు చంద్రయ్య, సుధాకర్, కృష్ణయ్య పాల్గొన్నారు.



శంకర్‌ను సన్మానిస్తున్న సర్పంచ్ రాములమ్మ, ఉపాధ్యాయులు